క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి జయంత్

నిర్మల్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని పలు షాపింగ్‌మాళ్లలో శుక్రవారం ఫైర్ సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విన్యాసాలు ప్రదర్శించారు. అంతకుముందు నిర్మల్‌లోని అగ్నిమాపక శా ఖ కార్యాలయంలో ఫైర్ సేఫ్టీపై, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక అధికారి జయంత్‌రాం, పలువురు సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహం

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శుక్రవారం నాలుగోరోజుకు చేరింది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం భజన, రాత్రి కీర్తనలు కొనసాగుతున్నాయి. భక్తులకు గ్రామకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సప్తాహం కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ముమ్మర తనిఖీలు

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బాదనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ బృందం అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు విరుద్ధంగా మద్యం, డబ్బు సరఫరా చేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు మదన్‌మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

21న హనుమాన్ విజయయాత్ర

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 21న భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్రను నిర్వహిస్తున్నట్లు భజరంగ్‌దళ్ పట్టణ అధ్యక్షుడు కపిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దేవరకోట ఆలయం నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే విజయయాత్రకు దీక్షాపరులు, హనుమాన్ భక్తులు, పట్టణవాసులు హాజరై విజయయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

కొండగట్టుకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న దీక్షాపరులు

సారంగపూర్: మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన హనుమాన్‌దీక్షాపరులు 16మంది శుక్రవారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. 115కిలోమీటర్ల దూరాన్ని మూడు రోజుల్లో చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని వారు పేర్కొన్నారు. వారి వెంట పది మంది ఇతరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఎస్సై పి.రవీందర్ సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులు ఎప్పుడు ఫోన్ చేయరని.. అపరిచితులు ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పని ప్రదేశాల వద్దకు వెళ్లి ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలను అందించారు. పోలింగ్ బూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న, గోపి ఉన్నారు.

విరాళం అందజేత



చెక్కు ఇస్తున్న కుభీర్ సంఘం నాయకులు

కుభీర్: బాసరలో నిర్మించే మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రానికి మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూ.లక్షా నూట పదహారు(1,00,116), ని గ్వా సంఘం ఆధ్వర్యంలో రూ.51వేలను వి రాళంగా అందించారు. మున్నూరు కాపు సంఘం తాలుకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్, మండలాధ్యక్షుడు వివేక్, కుభీర్ సంఘం అధ్యక్షుడు అరవింద్, ఉపాధ్యక్షుడు డి.దత్తాత్రి, విజయ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పూజలు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ హనుమాన్ ఆలయ ఆవరణలో శుక్రవారం నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. భక్తులు, ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఈదురుగాలులు.. అకాల వర్షం

- దెబ్బతిన్న పంటలు, నేలకొరిగిన చెట్లు
- భయాందోళనలో రైతులు



రాయపూర్‌కాండ్లీలో ఈదురుగాలులకు నేలకొరిగిన నువ్వు పంట



రాయపూర్‌కాండ్లీ రోడ్డుపై పడిన చెట్టు



కుభీర్: సిర్పెల్లిలో కూలిన ఇల్లు

లోకేశ్వరం: మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురువడంతో పంటలు దెబ్బతినడంతోపాటు పలు చోట్ల చెట్లు, ఇళ్లు కూలిపోయాయి. జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ,, ధర్మోరా, పంచగుడి, పిప్రి, వట్టోలి, సాథ్‌గాం, సేవాలాల్‌తండా, అర్లిగొడిసెరా, నగర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మిరప, నువ్వు, పసుపు, సజ్జ తదితర పంటలు దెబ్బతిన్నాయి. పంటలు చేతికొచ్చే వేళ అకాల వర్షం కురుస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రాయపూర్‌కాండ్లీ స మీపంలో రోడ్డుపై చెట్టు పడటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కు ప్పలను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడ్డారు.

కూలిన ఇల్లు, విరిగిన స్తంభాలు

కుభీర్: మండలంలోని సిర్పెల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులకు ఓ ఇంటి పైకప్పు(రేకులు) లేచిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగినట్లు పేర్కొన్నారు. రాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి తర్వాత పునరుద్ధరించారు.

‘ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి’



సోన్: కూలీలతో మాట్లాడుతున్న భవాని



కడెం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జు పటేల్

సోన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.భవాని అన్నారు. మండలంలోని పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాల్లో శుక్రవారం పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలను కలిసి కాంగ్రెస్ సంక్షేమ పథకాలను వివరించారు. అనతంరం మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి వేణి, వాసవి, లక్ష్మీ, మాజీ సర్పంచ్ రాజనర్సింహారెడ్డి, గంగారెడ్డి, మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

కడెం: ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ విజయం సాధించాలని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గ భవాని అన్నారు. మండలంలోని లింగాపూర్ దుర్గామాత ఆలయంలో పూజలు చేశారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, గంగాధర్, జలజ, రమాదేవి, శారద తదితరులు ఉన్నారు.

కడెం: ఉట్నూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే బొజ్జు సమక్షంలో కడెం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కల్లెడ గ్రామ మాజీ సర్పంచ్ తాటి సంజీవ్, బెల్లాల్‌కు చెందిన చెన్ను మల్లేశ్, సునీల్, నర్సయ్యకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, భూషణ్, రమేశ్, శ్రీనివాస్, రాజన్న, తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడి సమక్షంలో చేరిక

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ)కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పడిగల మహిపాల్, రజక సంఘం గ్రామ అధ్యక్షుడు నాంపల్లి రవి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు గుర్రం ముత్యం, నాగుల పోశెట్టి, పుట్టి నర్సయ్య, సుధీర్‌రెడ్డి, ప్రవీణ్, చందు పాషా, రమేశ్, శ్రీకాంత్, బెల్లం రవి, రాజేందర్, ఎండీ మజీద్, మురళి, గాంధారి రవి, రాజేశ్వర్, నరసయ్య, శ్రీనివాస్ ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, గంగాధర్‌గౌడ్ ఉన్నారు.

‘బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకుందాం’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక, కర్షకరాజ్యం రావాలంటే బీజేపీ ఓడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం 138వ మే డే పోస్టర్ ఆవిష్కరించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 29 కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసం బీజేపీని ఓడించి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకుందామని పేర్కొన్నారు. హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి.. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. మేడే వేడుకలను ఏఐటీయూసీ అనుబంధ యూనియన్లు, మండల, జిల్లా కేంద్రాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భూక్య రమేశ్, పద్మకుమారి, దుర్గే అనంతరావ్, దయాసాగరి, గోపమ్మ పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరుల ర్యాలీ



కడెం: పాండ్వపూర్‌లో ఆలయం వద్ద స్వాములు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో శుక్రవారం హనుమాన్ దీక్షాపరులు శ్రీరాముని విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. వీధుల గుండా సాగిన శోభాయాత్రలో యువకులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని పాతపాండ్వపూర్ హనుమాన్ ఆలయం నుంచి పెద్దూర్ హనుమాన్ ఆలయం వరకు శుక్రవారం హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరాం.. జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు రవీందర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం



గోదావరిలో తెప్పోత్సవంలో భక్తులు

ఖానాపూర్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పట్టణంలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంనగర్ కాలనీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి గోదావరి వరకు మహిళలు మంగళహారతులతో డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్రగా వెళ్లారు. విష్ణుభట్ల కీర్తిరాఘవశర్మ బృందం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, గంగహారతి, తెప్పోత్సవం నిర్వహించారు. అల్లాడి వెంకటేశ్వర్లు, సతీశ్‌రావు, శంకర్, లోకేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ప్రవేశపరీక్ష

సారంగపూర్: మండలంలోని జామ్‌లోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో 6, 7, 8, 9వతరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈనెల 21న ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమాకల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. 241మంది హాజరవుతారని.. అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించా రు.

రేపటి నుంచి దేవరకోట వార్షికోత్సవాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 67వ వార్షికోత్సవాలు ఈనెల 21 నుంచి 24వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 22న నిత్య హోమాలు, 23న రథ శోభాయాత్ర, 24న భక్తులకు ఆశీర్వచనాలు, సమస్త పూజలు నిర్వహించనున్ననట్లు పేర్కొన్నారు. భక్తులు వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం కోరం(సరిపడ సభ్యులు) లేక వాయిదా పడింది. అధికారులు హాజరైనా సభ్యులు రాలేదు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో గజానన్ ప్రకటించారు.

సాయం అందజేత

కడెం: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యావలంటీర్‌గా పని చేస్తున్న మంద కావ్య తండ్రి పోశెట్టి ఇటీవల మృతి చెందాడు. గ్రామంలోని ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కావ్య కుటుంబానికి రూ.14 వేలను ఆర్థికసాయంగా అందించారు. ప్రధానోపాధ్యాయుడు బచ్చు వెంకటరమణ, కూచనపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు



ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో, ఎస్సై

కుంటాల: కష్టపడి చదివితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో ముత్యం, ఎస్సై వి.రజినీకాంత్ సూచించారు. మండల కేంద్రంలోని సృజన విద్యాలయానికి చెందిన 29 మంది విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలకు, ఏడుగురు సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో కుంటాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన సృజన విద్యానిలయం ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్నను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, పాఠశాల కమిటీ చైర్మన్ సబ్బిడి రాకేశ్, పోషకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగీరథ జలం పరిశీలన



ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ హైమద్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో శుక్రవారం మిషన్ భగీరథ జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) హైమద్ శుద్ధజ లం సరఫరాను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులు భగీరథ నీరు తాగుతున్నారా.. లేదా అని తెలుసుకున్నారు. నీటి సరఫరాలో అంతరా యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. డీఈ వినోద్, డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, కార్యదర్శి సుర్జిత్‌రెడ్డి, నవీన్ ఉన్నారు.

జీవనోపాధిపై గిరిజనులకు అవగాహన

ఖానాపూర్: మండలంలోని కొలాంగూడలో గిరిజనులకు డీఆర్డీవోపాటు రిలయన్స్ ఫౌండేషన్, సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జీవనోపాధిపై అవగాహన కల్పించారు. గిరిజన మహిళలకు బుట్టల తయారీ, అల్లికలపై శిక్షణ ఇచ్చి ఆర్థికంగా ఎదగడానికి అవగాహన కల్పించినట్లు నాబార్డ్ డీడీఎం వీరభద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీవనోపాధిపై ఆసక్తి ఉన్న గ్రామస్తుల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ రమేశ్, సీఆర్‌డీ మేనేజర్ రాజు, వీవోఏ రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ పీరియా తదితరులు ఉన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కుంటాలలో కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి)లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం గ్రామప్రత్యేకాధికారి, ఏవో రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించేందుకు టోకెన్ పద్ధతి ఏర్పాటు చేశామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన పంట వివరాలు నమోదు చేసుకుంటే టోకెన్ జారీ చేస్తామని తెలిపారు. ధర క్వింటాలకు రూ.3180 ఉందని.. టోకెన్ ఆధారంగా 14శాతం లోపు తేమ ఉంటే గన్నీ బ్యాగులు అందించి కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ సలీం, ఏఎంసీ కార్యదర్శి మాధవ్, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, కుంటాల, పెంచికల్‌పాడ్, గ్రామాల్లో కుంటాల సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. సీ ఈ వో నాగభూషణం, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, భోజేందర్, మహేశ్, కృష్ణ, పురుషోత్తం, కిష్టయ్య, రైతులు పాల్గొన్నారు.

కుటుంబసర్వే సమగ్రంగా చేపట్టాలి

ఖానాపూర్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కుటుంబ సర్వేను సమగ్రంగా చేపట్టాలని సీడీపీవో సరిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో ఖానాపూర్, పెంబి, మామడ మండలాలకు చెందిన ఐదు సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సిబ్బంది రోజు విధి నిర్వహణలో భాగంగా ఎన్‌హెచ్‌టీఎస్ యాప్, పోషణ ట్రాకర్ యాప్‌లో పిల్లల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీలత, నిర్మల్, రాధ, శ్యామల, షెహనాజ్ తదితరులు ఉన్నారు.

ముస్తాబైన ఆలయం

- నేటి నుంచి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఆలయం

మామడ: కోరిన కోర్కెలు తీర్చి భక్తుల ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బ్రహోత్సవాలకు ముస్తాబు చేశారు. ఏటా చైత్రమాసంలో ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 20 నుంచి 24 వరకు అలయ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.

ఈనెల 20న శాంతిపాఠం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, గరుడపెళ్లి, అగ్నిప్రతిష్ఠ, బలిహరణం, నిత్యహవనం, 21న పెళ్లికుమారుడ్ని చేయడం, గోదాసమేత శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి కల్యాణం, భక్తులకు అన్నదానం, 22న వేదవిన్నపం, నిత్యహవనం, పూర్ణాహుతి, దీపోత్సవం, నిత్యహవనం, 23న రథబలి, రథోత్సవం, మహాపూర్ణాహుతి, స్వామివారికి అభిషేకం, ధ్వజరోహణం, 24ననాగవెల్లి, పుష్పయాగం, ఏకాంతసేవ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పొనకంటి జాతరగా ప్రసిద్ధి చెందిన ఈ బ్రహ్మోత్సవాలకు వివిధ గ్రామాల ప్రజలు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ప్రత్యేక హోమం చేసేందుకు హోమశాల ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నిర్మల్ నుంచి బస్సులు..

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం నిర్మల్ నుంచి పొన్కల్ వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



పాఠశాలలో పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే పనులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్మల్ పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ రాజేందర్, ఎంపీడీవో రాంప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీధర్, ప్రధానోపాధ్యాయుడు నాగన్న, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలి

సోన్: ప్రతిఒక్కరూ నిత్యం న్యూస్ పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలని కవి, రచయిత, ఖానాపూర్ వాస్తవ్యులు, కెనడా హైకమిషన్ మాజీ సలహాదారు డాక్టర్ టి.సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. తెలుగు ఉపాధ్యాయుడు పోతన్న సహకారంతో 19 మంది విద్యార్థులు రాసిన కథల పుస్తకం డీఈవో ఆవిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కథలు రాసేందుకు మెలకువలు చెప్పారు. అనంతరం సంపత్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఖానాపూర్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎస్.ప్రీతమ్‌ను శుక్రవారం ఖానాపూర్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎంపీ అభ్యర్థి సుగుణ గెలుపునకు పని చేయాలని చెప్పారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, కాంగ్రెస్ సోషల్ మీడియా ఖానాపూర్ కోఆర్డినేటర్ రాసమల్ల అశోక్ తెలిపారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు ముల్కి సత్తవ్వ, ఎడ్ల రమ, పోషకులు, గ్రామస్తులు ఉన్నారు.

సీతారాముల కల్యాణం

భైంసారూరల్: మండలంలోని కామోల్ రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు ఆలయంలో సప్తాహం ఏర్పాటు చేయగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాలాజీవాడ శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా విగ్రహాలకు భాజాభజంత్రీలు, మంగళహారతుల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం యాగశాల ప్రవేశం, గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన అవదూత్ వార్ సుదర్శన్ బుధవారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, కిష్టయ్య, ఎల్లన్న తదితరులు ఉన్నారు.

నామినీ వివరాలు సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్‌లో పడిగేల చిన్న సాయన్న అనే రైతు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఏఈవో సంతోష్ శుక్రవారం మృతుడి ఇంటికి వెళ్లి రైతుబీమాకు సంబంధించి నామినీ వివరాలు సేకరించారు.

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి

తానూరు: మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో మోహన్‌సింగ్ సూచించారు. శుక్రవారం మండలంలోని జౌలా(కే) గ్రామంలో పర్యటించారు. మురుగుకాల్వలు, నర్సరీలను పరిశీలించారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.